Andhra Jyothy Dt 27/09/17.

నాంపల్లి రైల్వే స్టేషన్... ఎంఎంటీఎస్ రైల్వే ప్రయాణికులతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. గాంధీభవన్... చుట్టూ రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, విద్య, వ్యాపార కేంద్రాలు, ఎగ్జిబిషన్ గ్రౌండ్ వంటి ప్రముఖ కేంద్రాలు చాలానే ఉన్నాయి. అందుకే ఇక్కడ ఎప్పుడూ రద్దీ ఉంటుంది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ గాంధీభవన్ వద్ద, నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద నిర్మిస్తున్న మెట్రో స్టేషన్‌లకు అనుసంధానంగా మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని ప్రతిపాదించింది. ఇందుకోసం చేనేత భవన్ వద్ద అధికారులు సుమారు అర ఎకరం స్థలాన్ని సేకరించారు.

# మెట్రో మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్

- అర ఎకరం స్థలంలో.. ఐదంతస్తుల్లో నాంపల్లిలో నిర్మాణం
- స్కైవేలతో రైల్వే, రెండు మెట్రో స్టేషన్‌ల అనుసంధానం
- గాంధీ భవన్ - నాంపల్లి మార్గంలో స్థలం




హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మహా నగర దశ, దిశను మార్చే మెట్రో ప్రాజెక్టులో పార్కింగ్ ప్రదేశాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం తీవ్రంగా ఉన్న పార్కింగ్ సమస్యను దృష్టిలో పెట్టుకొని తగిన చర్యలు తీసుకుంటున్నారు. 64 మెట్రో స్టేషన్లలో 34 చోట్ల పార్కింగ్ అండ్ సర్క్యులేషన్ కేంద్రాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. వీటిలో రెండు అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఐదు అంతస్తుల్లో పార్కింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించాలని నిర్ణయించారు. మెట్రో కారిడార్-1 (ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు ఉన్న) మార్గంలో నాంపల్లి రైల్వే స్టేషన్, గాంధీభవన్‌ల మధ్య అర ఎకరం స్థలంలో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. డీబీఎఫ్ఓటీ (డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) విధానంలో నిర్మించే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీటైల్ ప్రాజెక్టు రిపోర్టును అధికారులు సిద్ధం చేశారు. 2018 నవంబర్ నాటికి మెట్రోరైలు ప్రాజెక్టు పూర్తవుతుంది. ఈ లోగా ఐదు అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించేలా హైదరాబాద్ మెట్రోరైలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం ఐదంతస్తుల భవనంలో మూడు అంతస్తులు పార్కింగ్ కోసం, మరో రెండు అంతస్తులు షాపింగ్ కోసం కేటాయించనున్నారు. పార్కింగ్ ప్రాంతాల నుంచి నేరుగా మెట్రో స్టేషన్‌లకు వెళ్లేందుకు స్కైవాక్‌లను కూడా నిర్మించనున్నారు.

## నాంపల్లి రైల్వే స్టేషన్‌తో అనుసంధానం

ఐదు అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్స్‌ను మెట్రోరైలు ప్రయాణికుల కోసమే కాకుండా నాంపల్లి రైల్వే స్టేషన్, గాంధీ భవన్, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు వచ్చి వెళ్లే వారికి ఉపయోగపడేలా తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం పార్కింగ్ స్టేషన్ నుంచి మెట్రో స్టేషన్‌తో పాటు నాంపల్లి రైల్వే స్టేషన్, గాంధీ భవన్‌లకు స్కైవేలను ఏర్పాటు చేసి అనుసంధానం చేయనున్నారు.

## టెండర్‌లు పిలిచిన హెచ్ఎంఆర్...

కారిడార్-1లో అత్యాధునికంగా నిర్మించబోయే ఐదు అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్స్ కోసం అధికారులు ప్రైవేట్ సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించారు. పూర్తిగా ఆటో మెటిక్ టెక్నాలజీ ఆధారంగా పార్కింగ్ విధానం ఉంటుంది. అభివృద్ధి చెందిన నగరాల్లో పార్కింగ్ వ్యవస్థ ఎలా ఉందో అధ్యయనం ఇక్కడ అమలు చేయనున్నారు.

